# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 24-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ఢిల్లీ భారత్ మండపంలో యువజన ఆలోచనల మహాకుంభమేళా 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' జనవరి 11-12 తేదీల్లో జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు.
- రాష్ట్రంలో 85 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో 35 వేల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 29వ తేదీన విశాఖలో పర్యటించనున్న నేపద్యంలో కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఉన్నతాధికారులతో ఈ రోజు ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.
- హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నదని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు.

====================

ఢిల్లీలోని భారత్ మండపంలో యువజన ఆలోచనల మహాకుంభమేళా 'వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్' జనవరి 11-12 తేదీల్లో జరుగుతుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారు. దేశ ప్రజలతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన మనసులో మాటను పంచుకునే “మన్ కీ బాత్” కార్యక్రమం 116వ సంచిక ఈ రోజు దూరదర్శన్, ఆకాశవాణిల ద్వారా ప్రసారం అయ్యింది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. జనవరి 12న స్వామి వివేకానంద 162వ జయంతి ఈసారి చాలా ప్రత్యేకంగా జరుగుతుందని తెలిపారు. రాజకీయ నేపథ్యం లేని కుటుంబాలకు చెందిన యువత రాజకీయాల్లోకి రావాలని గతంలో తాను ఇచ్చిన పిలుపు మేరకు లక్ష మంది యువతను రాజకీయాలలోకి తెచ్చేందుకు దేశంలో వివిధ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జరుగుతున్నాయని అన్నారు. గ్రామం, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎంపికైన రెండు వేల మంది యువత భారత్ మండపంలో 'అభివృద్ధి చెందిన భారతదేశ యువ నాయకుల సంభాషణ' కోసం సమావేశమవుతుందని ప్రధానమంత్రి పేర్కొంటూ .....

(వాయిస్ 42 సెకన్లు)

===================

హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నదని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో  ఆగర్తిపాలెం గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఈ రోజు మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక్కొక్కటిగా హామీలు నెరవేర్చుతుండటంలో ప్రభుత్వం పట్ల ప్రజల్లో మరింత ఆదరణ పెరిగిందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే బకాయిలతో పాటు ఫించన్ చెల్లించి హామీ అమలుకు శ్రీకారం చూట్టామని మంత్రి వెల్లడిస్తూ....

(వాయిస్ 36 సెకన్లు)

విరామం

===================

రాష్ట్రంలో 85 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో 35 వేల ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం గ్రామంలో 14 లక్షల రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఈ రోజు లబ్దిదారునికి పంపిణీ చేసిన మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ... గడిచిన వారం రోజుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద నియోజకవర్గంలో సుమారు 40 లక్షల రూపాయలను నిరుపేదలకు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల 5 వేల పక్కా గృహాలు మంజూరు చేశామని మంత్రి తెలిపారు.

===================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 29వ తేదీన విశాఖలో పర్యటించనున్న  నేపద్యంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, వివిధ విభాగాల ఉన్నతాధికారులు,  ప్రజా ప్రతినిధులతో  కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో జరిగే బహిరంగ సభ, అంతకుముందు జరిగే  రోడ్ షో నిర్వహణపై, భద్రతాపరమైన అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ పర్యటనలో ప్రధానమంత్రి వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభకు ప్రధానమంత్రి సాయంత్రం 4 గంటల 40 నిమిషాలకు చేరుకొని, కార్యక్రమ అనంతరం 5 గంటల 45 నిమిషాలకు సభ నుంచి విమానాశ్రయానికి తిరుగుపయనమవుతారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షలో పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, పార్లమెంటు సభ్యులు ఎం. భరత్ తదితరులు పాల్గొన్నారు.

===================

దేశ ప్రజలతో ప్రధానమంత్రి నరేంద్రమోడీ తన మనసులో మాటను పంచుకునే  మన్ కీ బాత్ కార్యక్రమం 116వ సంచిక ఈ రోజు దూరదర్శన్ , ఆకాశవాణిల ద్వారా ప్రసారం  కాగా, తిరుపతి జిల్లా వాసులు జిల్లా వ్యాప్తంగా 27 శక్తి కేంద్రాల ద్వారా  ఆసక్తిగా  విన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు ప్రధానమంత్రి నరేంద్ర మోడి తమతో పంచుకున్న విషయాల పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. తిరుపతి వాసి ఆనందరావు ఆకాశవాణితో మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని మోడీ పిలుపునివ్వడం ఆకట్టుకుందని తెలియజేస్తూ..

(వాయిస్ 24 సెకన్లు)

===================

జూనియర్, డిగ్రీ, వృత్తి విద్యా  కోర్సుల ఫీజు చెల్లింపుకై  విద్యార్థులపై ఒత్తిడి చేస్తే ఆయా కళాశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్  ఏ. శ్యామ్ ప్రసాద్, కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిట్ బాషా ఈ రోజు వేర్వేరు ప్రకటనలలో స్పష్టం చేశారు. రీయింబర్స్మెంట్ కు అర్హత గల విద్యార్థులకు ఫీజు, మెస్ చార్జీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసే వరకు విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. విద్యార్దులకు హాల్ టికెట్లు జారీ చేయక పోయినా, ఒరిజినల్ ధృవ పత్రాలు ఇవ్వకున్నా, అదనపు మొత్తాలను వసూలు చేసినా కళాశాల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు.

====================

తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 28 నుండి డిసెంబర్ 6వ తేది వరకు జరగనున్న కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఈనె 26వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నట్లు టిటిడి తెలిపింది. 26వతేదీ ఉదయం సుప్రభాతం, సహస్రనామార్చన నిర్వహించిన అనంతరం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపడతారు. ఇందులోభాగంగా ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామాగ్రి తదితర అన్ని వస్తువులను శాస్త్రోక్తంగా శుద్ధి చేస్తారు. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా ఆర్జితసేవలైన కల్యాణోత్సవం, ఊంజలసేవను రద్దు చేసినట్లు టిటిడి ఆ ప్రకటనలో తెలిపింది.

====================
====================